వైఎస్ఆర్ కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
బుధవారం 03 జూన్ 2026

రేషన్ బియ్యం అక్రమ రవాణా

బద్వేల్, జూన్ 2, ప్రభాతవార్త

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని రఘునాథపురం గ్రామంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యత్నాన్ని స్థానిక ప్రజలు అడ్డుకుని భగ్నం చేశారు. గ్రామంలోని రేషన్ దుకాణం నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన స్థానికులు సంబంధిత వాహనాన్ని నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం బియ్యం నిల్వలు మరియు సంబంధిత వ్యక్తులను పోలీసుల ఆధీనంలోకి అప్పగించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రేషన్ బియ్యం ఎక్కడి నుంచి, ఎక్కడికి తరలిస్తున్నారనే అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

మంగళవారం జమ్మలమడుగు నియోజకవర్గ పర్యటనలో భాగంగా.. మధ్యాహ్నం ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డితో కలిసి.. గండికోట పర్యాటక క్షేత్రంలో సాస్కి ప్రోగ్రాం ద్వారా జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.

జిల్లాలో రుణాల పంపిణీలో లక్ష్యాలకు మించి పురోగతి

డిసిసి, డిఎల్ఆర్సి బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు..

కడప, జూన్ 2 ప్రభాతవార్త :

జిల్లాలో 2025, 26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక (ఏసీపీ) లక్ష్యాలను బ్యాంకులు గణనీయంగా అధిగమించి రుణాల పంపిణీలో విశేష పురోగతి సాధించాయని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి పాల్గొనగా వివిధ ప్రధాన బ్యాంకుల రీజనల్ మేనేజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల ఋణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్షా కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఇతర ప్రాధాన్యతా రంగాల అభివృద్ధికి బ్యాంకులు సమర్థవంతంగా సహకరించాయన్నారు. వ్యవసాయ రంగంలో రూ.15,533.71 కోట్ల లక్ష్యానికి గాను రూ.20,176.61 కోట్ల రుణాలు పంపిణీ చేసి 129.89 శాతం సాధించినట్లు వెల్లడించారు. పంట రుణాల కింద రూ.11,638.87 కోట్లు, వ్యవసాయ టర్మ్ లోన్లు, మౌలిక సదుపాయాలు మరియు అనుబంధ కార్యకలాపాలకు రూ.7,521.49 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.ప్రాధాన్యతా రంగంలో రూ.19,713.71 కోట్ల లక్ష్యానికి గాను రూ.24,138.66 కోట్ల రుణాలు పంపిణీ చేసి 122.36 శాతం సాధించగా, మొత్తం క్రెడిట్ ప్లాన్‌లో రూ.24,151.71 కోట్ల లక్ష్యానికి గాను రూ.33,922.30 కోట్ల రుణాలు పంపిణీ చేసి 140.38 శాతం పురోగతి నమోదు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎస్ఎంఈ) అభివృద్ధికి రూ.3,325.42 కోట్ల రుణాలు అందించగా, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.636.63 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఆర్థికాభివృద్ధికి బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అభినందించారు.అయితే, మార్చి 31, 2026 నాటికి జిల్లాలో మొత్తం ఎన్పీఏలు రూ.887.01 కోట్లుగా నమోదయ్యాయని, మొత్తం బకాయి రుణాల్లో ఎన్పీఏల శాతం 2.22గా ఉందని తెలిపారు. రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్పీఏలను మరింత తగ్గించేలా బ్యాంకులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాల అమలు, అర్హులైన లబ్ధిదారులకు రుణాల అందజేతలో బ్యాంకులు మరింత చురుకుగా వ్యవహరించాలని ఆయన కోరారు. రుణాలు అందించడంలో మార్చి మాసంతానికి గాను వైఎస్ఆర్ జిల్లా పురోగమనంలో లక్ష్యాన్ని అధిగమించినందుకు బ్యాంకర్లను అభినందించారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని రంగాల అభివృద్ధికి అపారమైన వనరులు ఉన్న ఆకాంక్ష జిల్లాను గ్లోబల్ ఎకానమీలో కీలక స్థానంలో నిలపాలన్నారు. డిఆర్డీఏ, మెప్మా శాఖల అధికారులు స్వయం సహాయక సంఘాల్లో బిజినెస్ స్కిల్స్ అభివృద్ధితో పాటు పొదుపు సంఘాల మహిళలకు రుణాలు అందించి జిల్లాను ఆకాంక్ష జిల్లా లక్ష్య సాధనలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలన్నారు. అంతేకాకుండా కడప సమృద్ధి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి మండలం నుండి చురుకుగా ఉన్న స్వయం సహాయక గ్రూపులను, రైతులను గుర్తించి వారిని ఈ కామర్స్ బిజినెస్ లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. జిల్లాలో త్వరలో ప్రారంభం కానున్న స్టార్ట్ అప్ కడప ఎంట్రప్రెన్యూర కేంద్రం ద్వారా దాదాపు ఏడాదికి 100 వరకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి.. ఆయా రంగాల్లో యువతకు నైపుణ్యాలను అందించి ప్రొఫెషనల్ ఎంట్రప్రెన్యూర్లుగా అభివృద్ధి చేసే కార్యక్రమాలపై బ్యాంకర్లు కూడా భాగస్వామ్యం వహించి ఆర్థిక చేయూతను ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ వికసిత భారత్, స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా.. "విజన్ యాక్షన్ ప్లాన్ 2024, 29" మేరకు జిల్లాను ఆర్థికంగా బలోపేతం చేయడంలో భాగస్వామ్యం కావాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్రప్రదేశ్ 2047 దిశగా "వైఎస్ఆర్ కడప జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ 2024, 29" ప్రకారం జిల్లాను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పించాలన్నారు. అభివృద్ధి తిరోగమనంలో ఉన్న ఆయా బ్యాంకు శాఖలు అందుకు కారణాలను తెలియజేయాలన్నారు. అలాగే.. బడుగు బలహీన వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన "స్టాండప్ ఇండియా", ముద్ర, గ్రామీణ ఖాదీబోర్డు వంటి ప్రభుత్వ పథకాలతో పాటు.. పంట రుణాలు, విద్యా రుణాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు.ప్రజల్లో డిజిటల్ లావాదేవీల నిర్వహణపై విస్తృత అవగాహన పెంచుతూ.. సమాజంలో జరుగుతున్న ఆర్థిక, సైబర్ నేరాల పట్ల అవగాహన తోపాటు మెళకువలను తెలిపే ప్రత్యేక క్యాంపెయిన్స్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో నాబార్డు డీడీఎం విజయ విహారి, యూబీఐ ఎజిఎం లక్ష్మీ తులసి, కెడిసిసి సీఈఓ రాజమణి, ఎస్బిఐ ఆర్ఎం అబ్దుల్ రావుఫ్, రీజర్వ్ బ్యాంక్ ఎల్డిఓ ఎలమంద, ఏపిజిబి కడప ఆర్ఎం శ్రీనివాస్ ప్రసాద్, రాజంపేట ఆర్ఎం రాఘవేంద్ర, డిఆర్డీఏ పిడీ రాజ్యలక్ష్మి, ఇండస్ట్రీస్ జీఎం చాంద్ బాషా, డీఏవో సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సతీష్ కుమార్, అనుబంధ శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు మంది క్రికెట్ బుకీలు అరెస్ట్

- రూ.2.20లక్షలు స్వాధీనం - రూ.4.14లక్షలు ఫ్రీజ్

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 2, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ పెద్దే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు ఏఎస్పీ విభుకృష్ణ పర్యవేక్షణలో ప్రొద్దుటూరు వన్‌టౌన్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ టి.వి.కొండారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ప్రొద్దుటూరులోని ఎర్రగుంట్ల-జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని మణి కేఫ్ వద్ద రాబడిన సమాచారం మేరకు క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్టు చేయడం జరిగింది. పోలీసుల వివరాల మేరకు ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించి బెట్టింగ్ లావాదేవీల వివరాలు, డబ్బులు చూసుకుంటూ ఉండగా వారిని పట్టుకొని విచారించగా ప్రధాన ముద్దాయి అయిన గోపిరెడ్డి సుదీప్‌రెడ్డి మరికొంత మంది బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ సందర్భంగా పెద్దమనుషుల సమక్షంలో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్‌లు, ఒక ల్యాప్‌టాప్ తదితర వస్తువులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ముద్దాయిల నుంచి రూ.2.20లక్షలు నగదు, ఒక ల్యాప్‌టాప్, 10 మొబైల్ ఫోన్లు, 16 బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.4.14లక్షలు ఫ్రీజ్ చేయడం జరిగింది. వారితో పాటు మరో 13 మంది ముద్దాయిలను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ముద్దాయిలను అరెస్టు చేయడంలో కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, పోలీసు సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

వివాదాస్పద సర్వే నెంబర్ 84

భూమిని పరిశీలించిన ఆర్డీవో

మైదుకూరు, జూన్ 02, ప్రభాతవార్త:

మైదుకూరు పట్టణ కడప రోడ్డు ప్రధాన రహదారి నేషనల్ హైవే బ్రిడ్జి ప్రక్కన రాముల వారి గుడి, వినాయక స్వామి, అనుకొని పక్కన ఉన్న సర్వే నెంబర్ 84 లో ముస్లింలు స్మశానానికి కేటాయించేందుకు ప్రతిపాదించిన భూమిని మంగళవారం బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. స్థానిక కడప రోడ్డులో ఉన్న సర్వే నెంబరు 84 లోని 2.95 ఎకరాల భూమిని ముస్లింల స్మశానానికి కేటాయించేందుకు అధికారులు ప్రతిపాదించారు. దానిపై చుట్టుపక్కల ఉన్న రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్మశానం ఏర్పాటయితే తమ భూములకు విలువ పడిపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం భూమి వద్దకు వచ్చిన రైతులతో డిఎస్పీ రాజేంద్రప్రసాద్, తహసిల్దార్ రాజసింహ నరేంద్ర మాట్లాడారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆర్డిఓకు రాతపూర్వకంగా తెలుసుకోవాలని చెప్పారు. మంగళవారం బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ భూమిని పరిశీలించేందుకు రాగా భూమిని కొలత వేయించామని 24 మంది కొంతమేర ఆక్రమించారని తహసిల్దార్ రాజసింహ నరేంద్ర ఆర్డీవోకు వివరించారు. ఈ విషయంపై ఆర్డీవోను వివరణ కోరగా భూమిని పరిశీలించేందుకు వచ్చానని నివేదికన కలెక్టర్ దృష్టికి పంపుతామని తెలిపారు. కాగా ఆర్డీవోకు అభ్యంతరాలను తెలపాలని తహసిల్దార్ డిఎస్పి సోమవారం తెలిపిన మంగళవారం ఆర్డిఓ వస్తున్న విషయాన్ని రైతులకు తెలియజేయక పోవడంతో వారు తమ అభ్యంతరాలను తెలుపుకునే అవకాశం లేకపోయింది.

కల్తీ ఆహార పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు

బద్వేల్, జూన్ 2 ప్రభాతవార్త :

ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహార పదార్థాలు అందేలా ఆహార భద్రతా శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎం. హరిత తెలిపారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధవటం రోడ్డులో ఉన్న పాల కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా.. పాల కేంద్రంలో విక్రయిస్తున్న పాలు, నెయ్యి, పెరుగు నాణ్యతను పరిశీలించి, ప్రయోగశాల పరీక్షల నిమిత్తం వాటి నమూనాలను సేకరించినట్లు హరిత తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా కల్తీ లేదా నాణ్యతలేని ఆహార పదార్థాలను విక్రయించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆహార వ్యాపారులు పరిశుభ్రతా ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన ఉత్పత్తులనే విక్రయించాలని సూచించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, పరిశుభ్రమైన మరియు సురక్షితమైన ఆహార పదార్థాల లభ్యత కోసం బద్వేల్ మున్సిపాలిటీ, ఆహార భద్రతా శాఖలు సంయుక్తంగా చర్యలు కొనసాగిస్తున్నాయని హరిత పేర్కొన్నారు.ఈ తనిఖీల్లో బద్వేల్ మున్సిపాలిటీ శానిటరీ ఇన్స్పెక్టర్ (ఐ/సీ) జి. రమణయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సిద్ధవటం

రహదారికి అడ్డంగా నేలకొరిగిన వృక్షం... అక్కడి నుంచి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే

సిద్ధవటం జూన్ 2 ప్రభాతవార్త

ఒకప్పుడు జిల్లా కేంద్రంగా పరిపాలన కేంద్రంగా ఉన్న సిద్ధవటం సమస్యల వలయంతో కోట్టుమిట్టాడుతోంది. దారి పొడవునా డ్రైనేజీ ఏరులై పారుతుండడంతో ప్రజలు బంబేలెత్తుతున్నారు. రహదారికి అడ్డంగా వృక్షం పడిపోయి దాదాపు పది రోజులు కావస్తున్న తొలగించే దిక్కులేరంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రాహ్మణ వీధిలోని శ్రీ సాయి స్కూల్ ఎదురుగా ఉన్న రహదారిలో డ్రైనేజీ వాటర్ రహదారిపై పారుతుండడంతో ఆదారిలో వెళ్లాలంటే ప్రాంత ప్రజలు ముక్కు మూసుకుని వెళ్తున్నారు. మఠం వీధిలో ఇటీవల కురిసిన వర్షాలకు రహదానికి అడ్డంగా వృక్షం పడిపోవడంతో రహదారి కనిపించక ప్రజలు అవస్థలు పడుతున్నా చెట్టును తొలగించే నాదుడే లేడు. దిగువపేట ప్రధాన రహదారి, ప్రక్కన డ్రైనేజీ నీటిలో చెత్త పేరుకుపోయి కంపు కొడుతుంటే తొలగించడం లేదు. దీంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు ప్రజా సమస్యలు దృష్టిలో పెట్టుకొని తొలగించాలని చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్ వివరణ కోరగా, బ్రాహ్మణ వీధిలో డ్రైనేజీ సమస్యను పరిష్కారం చేస్తామని దిగువపేటలో ఉన్న అపరిశుభ్రతను పూర్తిగా తొలగించేందుకు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం చేస్తామని మఠం వీధిలో ఉన్న వృక్షాన్ని తొలగించేందుకు స్థల యజమానితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

యువకున్ని బలి తీసుకున్న

అతివేగం

అంబకపల్లి సమీపంలో బొలెరో పికప్ బోల్తా

17 ఏళ్ల పవన్ మృతి

పులివెందుల, జూన్ 2 , ప్రభాత వార్త :

అతివేగం, నిరక్ష్యపు డ్రైవింగ్ మరో యువ ప్రాణాన్ని బలి తీసుకుంది. లింగాల మండలం అంబకపల్లి గ్రామానికి చెందిన మోపూరు వెంకట పవన్ (17) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వాహనం నడుపుతున్న డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు లేకుండా బయట పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. అంబకపల్లి గ్రామానికి చెందిన మోపూరు వెంకట పవన్, అతని బంధువైన మల్లెల వెంకటరమణ (28)తో కలిసి అరటికాయల లోడును అనంతపురం తరలించేందుకు వెళ్లాడు. వెంకటరమణ తనకు చెందిన మహీంద్రా బొలెరో పికప్ వాహనంలో అరటికాయల లోడును అనంతపురంలో దించి తిరిగి గ్రామానికి బయలుదేరాడు.అనంతపురం నుంచి తిరిగి వస్తున్న సమయంలో ముదిగుబ్బ ఘాట్ దాటిన అనంతరం వెంకటరమణ వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపినట్లు సమాచారం. అంబకపల్లి గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న లైట్ పోల్‌ను ఢీకొట్టింది. దీంతో వాహనం బోల్తా పడింది.ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న మోపూరు వెంకట పవన్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పులివెందుల ప్రభుత్వ సాధారణ ఆసుపత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు పవన్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఇప్పటివరకు లింగాల పోలీస్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు అందలేదని, మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని లింగాల స్టేషన్ ఎస్సై తెలిపారు. ప్రమాదంలో యువకుడు మృతి చెందడంతో అంబకపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు హృదయ విదారకంగా మారాయి.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

వర్షాకాలంలో

ఇసుక తవ్వకాలపై ప్రత్యేక దృష్టి

కడప, జూన్ 2 ప్రభాతవార్త:

వర్షా కాలంలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు నిరంతర ఇసుక సరఫరా కల్పించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డిఎల్ఎస్ సి) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు.. వర్చువల్ విసి ద్వారా రాజంపేట సబ్ కలెక్టర్ భావన హాజరయ్యారు. ఈ సమావేశంలో ఇసుక తవ్వకాలు, రీచ్‌ల నిర్వహణకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సస్టైనబుల్ శాండ్ మైనింగ్ మార్గదర్శకాల ప్రకారం జూన్ 1 నుంచి అక్టోబర్ 15 వరకు నదీగర్భాల్లో ఇసుక తవ్వకాలను నిలిపివేసి, ఇప్పటికే స్టాక్‌యార్డుల్లో ఉన్న ఇసుకను మాత్రమే రవాణా చేయాలని నిర్ణయించారు.నందలూరు మండలం పాటూరులో ప్రతిపాదిత ఇసుక రీచ్‌కు రెవెన్యూ క్లియరెన్స్ పెండింగ్‌లో ఉందని, తిరుపతి జిల్లాకు లక్ష మెట్రిక్ టన్నుల ఇసుక కేటాయింపు ప్రస్తుతం సాధ్యం కాదని కమిటీ స్పష్టం చేసింది. జిల్లాలో టెండర్ ప్రక్రియలో భాగంగా మూడు రీచ్‌లకు ఒప్పందాలు పూర్తయ్యాయని, మరికొన్ని రీచ్‌లకు పనితీరు భద్రతా డిపాజిట్లు ఇంకా చెల్లించాల్సి ఉందని తెలిపారు.ఇసుక రవాణాలో అక్రమాలను అరికట్టేందుకు అదనంగా 500 హోలోగ్రామ్ ట్రాన్సిట్ ఫారం రోల్స్ తెప్పించాలని నిర్ణయించారు. అలాగే ఇసుక లభ్యత, ధరలు, నాణ్యతపై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఉన్నట్లు సర్వేలో వెల్లడైందని కలెక్టర్ తెలిపారు. అన్ని అంశాలపై జిల్లా శాండ్ కమిటీ తుది నిర్ణయాలు తీసుకోనుందన్నారు.జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా మరియు సరఫరా వ్యవస్థను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

కోదండరామాలయంలో ప్లాస్టిక్ నిషేధంపై ఏపీపీసీబీ అవగాహన కార్యక్రమం

కడప, జూన్ 2 ప్రభాతవార్త :

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువులను నివారించి, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని జిల్లా పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ కోరారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం2026ను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయంకడప ఆధ్వర్యంలో.. వొంటిమిట్టలోని శ్రీ కోదండరామాలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రాంగణంలో ఘన వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై భక్తులకు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆమె తెలిపారు.ప్లాస్టిక్ ఉత్పత్తులకు బదులుగా కాగితపు సంచులు, బుట్టలు వంటి ప్రత్యామ్నాయ వస్తువులను వాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో, మార్కెట్‌లో కాగితపు సంచులు, బుట్టలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో గిగిదీ డివ్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రశాంతి, ఏపీపీసీబీ కడప సిబ్బందితో పాటు జువారీ సిమెంట్స్, భారతీ సిమెంట్స్, దాల్మియా సిమెంట్స్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, అక్షయ కెమికల్స్, యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, జీఎం ఎకో సర్వీసెస్, శ్రీసాయి ఎలక్ట్రికల్స్, తిలి డిక్సన్ టెక్నాలజీస్, సెంచరీ ప్లైవుడ్ తదితర పరిశ్రమల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పచ్చదనం పెంచేందుకే విత్తన బంతి కార్యక్రమం

సిద్ధవటం, జూన్ 2 ప్రభాతవార్త

అటవీ ప్రాంతాలను పచ్చదనాన్ని పెంచేందుకు విత్తన బంతి కార్యక్రమం చేపడుతున్నట్లు కడప సబ్ డిఎఫ్ఓ స్వామి వివేకానంద తెలిపారు మండలం లోని కడప చెన్నై జాతీయ రహదారి జేఎంజే కళాశాల సమీపాన కడప ఫారెస్ట్ రేంజ్ పరిధి లోని రాజీవ్ స్మృతి వనంలో కడప, డీఎఫ్ఓ, వినీత్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విత్తన బంతి కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా కడప ఫారెస్ట్ రేంజ్అడిషనల్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విత్తన బంతి తయారు చేసుకొని వర్షాలు పడ్డాక అటవీ ప్రాంతాన్ని పచ్చదనాన్ని పెంచేందుకు చింత, కానుగ, ఉసిరి, నేరేడు, రాగి, మారేడు, వివిధ ఔషధ మొక్కల విత్తనాలు చల్లడం జరుగుతుందని అటవీ ప్రాంతాన్ని పచ్చదనం పెంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తెలిపారు 70 శాతం సేంద్రియ ఎరువు, 30శాతం ఎర్రమట్టి సహాయంతో విత్తన గోలీలు తయారుచేసి వాటిని స్వచ్ఛంద సేవా సంస్థలకు అందజేసి అడవుల్లో చెల్లిస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కడప ఫారెస్ట్ రేంజర్ ప్రసాద్, రివ్యూ, డిప్యూటీ, డైరెక్టర్ దామా, పివి కృష్ణారావు, సోషల్ ఫారెస్ట్ డిఆర్ఓ, టి నాగరాజు, కడప డిఆర్ఓ ఓబులేసు భాకరాపేట, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎఫ్ ఎస్ ఓ రవిచంద్ర,ఎన్జీవో గంగయ్య, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రొటెక్షన్ వాచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు 44,104 దరఖాస్తులు

ప్రత్యేక కేటగిరీ ధృవీకరణకు షెడ్యూల్ విడుదల

జూన్ 12 న ఎంపిక జాబితా విడుదల

ప్రవేశాల కన్వీనర్ డాక్టర్ అమరేంద్ర కుమార్

వేంపల్లె జూన్ 02 ప్రభాతవార్త

ఇడుపులపాయ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ లో 202627 విద్యా సంవత్సర ప్రవేశాలకు సంబంధించి మొత్తం 44,104 దరఖాస్తులు అందినట్లు ప్రవేశాల కన్వీనర్ డా. అమరేంద్ర కుమార్ తెలిపారు. ప్రత్యేక కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధృవీకరణ కోసం ప్రత్యేక షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు వెల్లడించారు. ప్రత్యేక కేటగిరీలకు చెందిన అభ్యర్థుల ధృవీకరణ కార్యక్రమం ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. బిఎస్ జి, సిఏపి, ఎన్ సిసి, స్పోర్ట్స్ కేటగిరీల అభ్యర్థులను తేదీల వారీగా విభజించి ధృవీకరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని సంబంధిత విద్యార్థులకు ఈమెయిల్, ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలియజేయడంతో పాటు, ధృవీకరణకు ఎంపికైన వారి జాబితాను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. జూన్ 5న సిఏపి కేటగిరీకి చెందిన 85 మంది, ఎన్ సిసి కేటగిరీకి చెందిన 497 మంది, స్పోర్ట్స్ కేటగిరీకి చెందిన 167 మంది అభ్యర్థులు కలిపి మొత్తం 749 మందికి ధృవీకరణ నిర్వహించనున్నారు. జూన్ 6న సిఏపి కేటగిరీలో 97 మంది, ఎన్ సిసి లో 487 మంది, స్పోర్ట్స్‌లో 164 మంది అభ్యర్థులు సహా మొత్తం 748 మందికి ధృవీకరణ చేపట్టనున్నారు. అదేవిధంగా జూన్ 8న బిఎస్ జి కేటగిరీకి చెందిన 282 మంది, సిఏపి లో 55 మంది, ఎన్ సిసి లో 305 మంది, స్పోర్ట్స్‌లో 119 మంది అభ్యర్థులు కలిపి మొత్తం 761 మందికి ధృవీకరణ నిర్వహించనున్నారు. పి హెచ్ కేటగిరీ కింద మొత్తం 195 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఈ కేటగిరీకి సంబంధించిన ధృవపత్రాలను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ద్వారా ధృవీకరించనున్నందున, పిహెచ్ అభ్యర్థులు పై ప్రత్యేక కేటగిరీ ధృవీకరణకు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపారు. మొత్తంగా ప్రత్యేక కేటగిరీ కింద 2,453 మంది అభ్యర్థులు ఉండగా, అందులో ఎన్ సి సి కేటగిరీలో అత్యధికంగా 1,289 మంది ఉన్నారు. స్పోర్ట్స్ కేటగిరీలో 450 మంది, బిఎస్ జి లో 282 మంది, సిఏపి లో 237 మంది, పిహెచ్ కేటగిరీలో 195 మంది అభ్యర్థులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రత్యేక కేటగిరీ ధృవీకరణ కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఆర్జీయూకేటీ ప్రవేశాలకు సంబంధించిన ఎంపిక జాబితాను జూన్ 12న విడుదల చేయనున్నట్లు కన్వీనర్ డా. అమరేంద్ర కుమార్ తెలిపారు.

పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలి

ఒంటిమిట్ట జూన్.02 ప్రభాతవార్త

మండల కేంద్రమైన ఒంటిమిట్ట ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం ఆరోగ్య సిబ్బంది ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారులు భావన, అరుణ జ్యోతి, సిద్ధవటం సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు పాల్గొన్నారు. ఈనెల 28వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందని 0 నుండి 05 సంవత్సరముల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని ఆశా వర్కర్లు మండల గ్రామాల్లోని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించాలని మలేరియా రహిత సమాజంగా తీర్చిదిద్దాలన్నారు. మలేరియా వ్యాధి నుంచి ప్రజలను కాపాడాలన్నారు. మండల గ్రామాల్లో ఉన్న ప్రజలకు మలేరియా వ్యాధి నిర్మూలనపై తగిన విధంగా సలహాలు సూచనలు ఆరోగ్య సిబ్బంది ఇవ్వాలన్నారు. మండల గ్రామాల్లోని నీటి నిల్వ గుంతలను గుర్తించి తొలగించాలన్నారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లయితే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్యుల పర్యవేక్షణలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. దురదృష్టవశాత్తు వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే రోగగ్రస్తుల ఇంటి వద్దనే సూపర్వైజర్ ఆధ్వర్యంలో మగ ఆరోగ్య కార్యకర్త ద్వారా ఉచితంగా రాడికల్ ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రాత్రి వేళల్లో ధోమితెరలు వాడాలని నిండుగా ఉన్న దుస్తులు ధరించినట్లయితే దోమలు కుట్టకుండా సహాయపడతాయన్నారు. తమ ఇళ్లల్లో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. ఫ్రైడే డ్రై డే పాటించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ, సూపర్వైజర్ భాస్కర్‌రెడ్డి, సుజాత, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, సిహెచ్ఓలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన తెలంగాణ నవనిర్మాణ

సంకల్ప సభకు అనుమతి నిరాకరణ

సభ రద్దుపై దాసరి రవిశంకర్ తీవ్ర విమర్శలు

వేంపల్లె, జూన్ 2. ప్రభాతవార్త

హైదరాబాద్‌లో జరగాల్సిన జనసేన పార్టీ తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో సభ రద్దయినట్లు పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్ తెలిపారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సాయంత్రం 4:30 గంటలకు జూబ్లీహిల్స్‌లో మీడియా సమావేశం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ, తెలంగాణలో జనసేన పార్టీ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుందనే భయంతోనే సభకు అనుమతి నిరాకరించారని, ఇది ప్రజాస్వామ్యంలో భావప్రకటన స్వేచ్ఛను హరించే చర్య అని పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. అలాగే పవన్ కళ్యాణ్ తెలంగాణలో పార్టీ భవిష్యత్ కార్యాచరణతో పాటు ప్రభుత్వ వైఖరిపై కీలక వ్యాఖ్యలు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చెన్నకృష్ణ రెడ్డి, లక్ష్మీ నారాయణ, శ్రీనివాసులు, కృష్ణయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ వెంకటేశ్వర స్వామి

దేవస్థానం ఈవోగా కృష్ణయ్య

బద్వేలు అర్బన్, జూన్ 2, ప్రభాతవార్త

పట్టణంలోని నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నూతన ఈవో కృష్ణయ్యకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శ్రీమద్ భగవద్గీత పారాయణ కమిటీ ఆధ్వర్యంలో, ఎంవీఐ శేఖర్‌రావు సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, భగవద్గీత కమిటీ సభ్యులు, ఆలయ పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. భగవద్గీత కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కూచిపూడి శిక్షణా కేంద్రానికి చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొని సన్మానించారు.

విగ్రహ ఆవిష్కరణకు ఆహ్వానం

గోపవరం. జూన్ 2. ప్రభాతవార్త.

పులివెందుల నియోజకవర్గంలో ఈ నెల 6వ తేదీన జరగనున్న భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారి వాజపేయి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేయవలసిందిగా డిసిసి బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్య నారాయణ రెడ్డి కి ఆహ్వాన పత్రికను బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి అందజేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ వంగళ శశిభూషణ్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఆహ్వాన పత్రికను అందజేసి, కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరడం జరిగింది. దేశాభివృద్ధికి, సుస్థిర పాలనకు విశిష్ట సేవలు అందించిన అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారకార్థం నిర్వహిస్తున్న ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘన విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేయబడింది.

తాగునీటి సమస్య.. తీవ్ర ఇబ్బందులు

ముద్దనూరు, జూన్ 02 ప్రభాతవార్త :

మండలంలోని చిన్న కత్తరపల్లె గ్రామంలో గత మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటింటికీ తాగునీరు అందకపోవడంతో గ్రామస్తులు ప్రత్యామ్నాయంగా రైతులను అడిగి వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకుని అవసరాలు తీర్చుకుంటున్నట్లు తెలిపారు. తాగునీటి కోసం మహిళలు, వృద్ధులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో తాగునీటి సమస్య మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు. గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోవడానికి గల కారణాలను గుర్తించి వెంటనే సమస్యను పరిష్కరించాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. తాగునీటి సమస్యపై ఉన్నతాధికారులు చొరవ తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అనుమానస్పద స్థితిలో మహిళ మృతి

లక్కిరెడ్డిపల్లి: జూన్ 2 ప్రభాత వార్త

మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లి లోని బస్టాండ్ మసీదు వద్ద ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్న పవిత్ర (34) మంగళవారం అనువాదాస్పదతో మృతి చెందినట్లు ఎస్సై గోల్కొండ శోభ తెలిపారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. కేసు నమోదు చేసి వివరాలు కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

శ్మశాన వాటిక ప్రకటనపై

వ్యవసాయ రైతులు కలెక్టర్ దృష్టికి,

మైదుకూరు, జూన్ 02 ప్రభాతవార్త :

కడప జిల్లా, మైదుకూరు మండలం, యస్. మైదుకూరు గ్రామ పొలం సర్వే నెం. 84లోని ఎ. 2.95 సెంట్లు నిషేధిత ప్రభుత్వ భూమిలో (పాలెం చెరువు అలుగు వంక) ముస్లింల కోసం శ్మశాన వాటిక (ఖబరస్తాన్) కొరకు స్థలం కేటాయించుటలో తగు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి వెళ్లిన వ్యవసా రైతులు,మైదుకూరు టౌన్, కడప రోడ్, యస్. మైదుకూరు గ్రామ పొలంలో సర్వే నెం.84 భూమి ప్రభుత్వమువారు నిషేధిత భూమిగా ప్రకటించియున్నారు. కడప రోడ్డులోని ఈ ప్రభుత్వ భూమిలో యెడమ వైపు పాలెం చెరువు అలుగు వంక ప్రవహించుచున్నది. ఈ వాగుకు సమీపములో శ్రీ విఘ్నేశ్వర స్వామి మరియు శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానములు వెలసి వున్నవి. ప్రతి సంవత్సరము శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగును, హనుమాన్ జయంతి ఉత్సవాలు, బండలాగుడు పందెలు జరుగును. వినాయక చవితి ఉత్సవాలు, నాగుల చవితి పండుగ పుట్ట వద్ద ఘనంగా వేడుకలు జరుగును.అలాగే పాళెం చెరువు ఇరిగేషన్ డిపార్ట్మెంటు క్రింద ఉంది. దీనికి వారు కూడా ఎన్.ఓ.సి ఇవ్వలేదు. కావున ఇక్కడ దయ ఉంచి దేవస్థానములు ఉన్నందున హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండాలని అలాగే ముస్లీం సోదరులకు ఇంకొక చోట స్మశాన వాటికను కేటాయించాల్సిందిగా కోరడమైనది. వ్యవస్యాము చేసుకుంటున్న మాకు ఈ వంక పోరంబోకు స్థలములో ముస్లింలకు శ్మశాన వాటికకోసం స్థలము కేటాయించారని తెలియుచున్నది. ఈ వంక స్థలములో శ్మశాన వాటికకు స్థలము కేటాయించినచో ఈ వంక ప్రక్కన్న వున్న వ్యవసాయ రైతులకు తీరని అన్యాయము జరుగగలదని వేడుకున్నట్టు తెలిపారు.

ఫోటోగ్రాఫర్ కుటుంబానికి సరుకుల అందజేత

పులివెందుల, జూన్ 2 ప్రభాతవార్త :

పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట చిన్నన్న రూముల్లో నివాసం ఉంటున్న ఫోటోగ్రాఫర్ బాబు ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి వైఎస్సార్ ఫోటో అసోసియేషన్ యూనియన్ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. బాబు మృతి విషయం తెలుసుకున్న వైఎస్సార్ ఫోటో అసోసియేషన్ యూనియన్ అధ్యక్షుడు అల్లాభకాష్, గౌరవ అధ్యక్షులు శివారెడ్డి, ప్రసాద్, సుధాకర్, చిన్న యోగి ఆధ్వర్యంలో మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాబు భార్య, పిల్లలకు రూ.34 వేల నగదు సహాయంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, సేవా దృక్పథంతో ప్రతి సభ్యుడు ముందుకు రావాలని, యూనియన్‌లోని సభ్యులకు ఏవైనా ప్రమాదవశాత్తు సంఘటనలు జరిగితే వారి కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కష్టకాలంలో సహచరుల కుటుంబాలకు తోడుగా ఉండటం ద్వారా సంఘీభావం మరింత బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేశవ, శివ, సురేంద్ర, దస్తగిరి, పరమేష్‌తో పాటు పలువురు ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు మరియు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల మోటర్ వైర్లు

దోపిడీకి గురికాకుండా కాపాడండి.

మైదుకూరు, జూన్ 02, ప్రభాతవార్త:

మైదుకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధి మండల గ్రామాలలో వ్యవసాయ రైతుల మోటరు నుండి స్టాటరుకు మధ్య ఉన్న వైర్లు ఏదో ఒక గ్రామ పరిసరాల్లో దోపిడీ చేస్తున్నారని వారి నుండి రక్షణ కల్పించాలని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షుడు ఏ.వి రమణ పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయాధికారులను కోరారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్ అందుబాటులో లేకపోవడంతో అందుబాటులో ఉన్న ఏఎస్ఐ గుండయ్య కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం రమణ మాట్లాడుతూ వ్యవసాయ రైతులు పగలంతా కష్టపడి సాయంకాలం సేదతీరి ఉదయాన్నే పంట పొలం లో ఉన్న వ్యవసాయ బోర్ల దగ్గరికి వెళ్లేసరికి మోటార్ వైర్లు దొంగతనం చేయడంతో వ్యవసాయ భూమిలో ఉన్న పంట కు నీరు పారించకుండా ఇబ్బందులకు గురి కావడం వల్ల రైతులు చాలా నష్టపోతున్నట్లు తెలిపారు.వైర్లు దొంగతనం చేస్తున్న దొంగలపై నిఘా ఉంచి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, నరసింహులు, శ్రీనివాసులు, కాజీపేట మండల గ్రామాల రైతులు సుబ్రహ్మణ్యం, మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కోర్టు సమస్యలు జడ్జి దృష్టికి

నందలూరు, జూన్ 2 ప్రభాతవార్త:

నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించిన పలు సమస్యలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలాజీ మెడమల్లి దృష్టికి నందలూరు బార్ అసోసియేషన్ సభ్యులు తీసుకెళ్లారు. రాజంపేటలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కోర్టు పరిధిలో ఉన్న సమస్యలను వివరించారు. సమస్యలపై స్పందించిన జస్టిస్ బాలాజీ మెడమల్లి, సంబంధిత అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ ప్రతినిధులు జస్టిస్ బాలాజీ మెడమల్లి ని పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ అలీ, సీనియర్ న్యాయవాది, మాజీ బార్ అధ్యక్షుడు దాసరి నరసింహులు, ఉపాధ్యక్షుడు జి. సుబ్బరామయ్య, జూనియర్ న్యాయవాది సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం,

ప్రపంచ యోగా దినోత్సవం

గోపవరం. జూన్ 2. ప్రభాతవార్త.

మోడీ 12 సంవత్సరాల పరిపాలన విజయోత్సవాల కార్యక్రమాలకు జిల్లా కన్వీనర్ గా ఉట్టి శ్రీనివాసులు. భారతీయ జనతా పార్టీ చాలా ప్రతిష్టాత్మకంగా ప్రపంచ యోగ దినోత్సవం,,ప్రపంచ పర్యావరణ దినోత్సవం, నరేంద్ర మోడీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేకమైనటువంటి కార్యక్రమాలు చేపట్టినది. బిజెపి కడప జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి పై మూడు కార్యక్రమాలకు ఒక నలుగురు వ్యక్తులతో కమిటీని నియమించారు. ఆ కమిటీకి జిల్లా కన్వీనర్ గా బిజెపి కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులను నియమించాడు. ఈ సందర్భంగా ఉట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ పై మూడు కార్యక్రమాలు బిజెపి కార్యకర్తలతోనూ, ప్రభుత్వ అధికారులతోనూ,,పాఠశాలల యాజమాన్యంతోను సమన్వయం చేసుకొని విజయవంతం చేస్తామని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి కార్యక్రమాల పట్ల శ్రద్ధ చూపించినటువంటి పరిస్థితి లేదు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పర్యావరణ పట్ల, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని ప్రజలలో సంపూర్ణమైన అవగాహన కల్పించి వికసితభారత్ లక్ష్యంగా పై మూడు కార్యక్రమాలు చేపట్టిందని ఉట్టి శ్రీనివాసులు తెలిపాడు. ఈ యొక్క కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా నాయకుడు ఉండేల శ్రీనివాస్ రెడ్డి, బిజెపి నాయకులు జింక బాలకృష్ణ, వీరి పోగు కిరణ్, గంజరబోయిన శివశంకర్, ఏదు నాగరాజు,మున్నెల్లి గురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా

ఇంటింటి సర్వే గురించి..

సుండుపల్లె, జూన్ 02,ప్రభాతవార్త :

మండల పరిధిలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసిల్దార్ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో బిఎల్ఏల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎస్ ఐ ఆర్ ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేలో భాగంగా బిఎల్ఎలు, బిఎల్ఓలు అందరూ సమన్వయంతో మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాను లెక్కింపు చేయాలని సూచించారు.అలాగే కొత్త ఓటర్ల నమోదు చేర్పులు మార్పులు చేపట్టాలని చూచించారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని పార్టీల బిఎల్ఏలు హాజరయ్యారు.

ప్రజాదరణను చూసి భయపడుతున్నారు

సిద్ధవటం, జూన్ 2: ప్రభాతవార్త

జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై ఆంక్షలు విధించడం లేదా ఆయన కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించడం ఎవరి వల్లా కాదని రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు జనసేన పార్టీ చేసిన ప్రయత్నాలకు అనుమతులు నిరాకరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ కేవలం ఒక రాష్ట్ర నాయకుడు మాత్రమే కాదని, దేశవ్యాప్తంగా యువత, ప్రజల్లో విశేష ఆదరణ పొందిన నాయకుడని అన్నారు. అలాంటి నాయకుడి సభలకు అనుమతి ఇవ్వకుండా అడ్డుకోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా ఏ రాష్ట్రంలోనైనా రాజకీయ కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని, దేశంలో తిరగడానికి పాస్‌పోర్ట్ అవసరం లేదని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్‌కు పెరుగుతున్న ప్రజాదరణను చూసి కొందరు రాజకీయ నాయకులు భయపడుతున్నారని, అందుకే జనసేన పార్టీ కార్యకలాపాలను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణలో కూడా జనసేనకు ఆదరణ రోజురోజుకు పెరుగుతోందని, ఆ వాస్తవాన్ని జీర్ణించుకోలేక కొందరు నాయకులు అనవసర వివాదాలు సృష్టిస్తున్నారని అన్నారు. జనసేన పార్టీ ఎదుగుదలను ఎవరూ అడ్డుకోలేరని, ప్రజల మద్దతుతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన ప్రభుత్వాలు రాజకీయ పక్షపాత ధోరణితో వ్యవహరించడం సరికాదని, ఇలాంటి చర్యలు ప్రజల్లో వ్యతిరేకతను పెంచుతాయని అతికారి కృష్ణ హెచ్చరించారు.

గోదాముపై విజిలెన్స్ దాడులు

దువ్వూరు, జూన్ 02, ప్రభాతవార్త:

మండల పరిధిలోని మురళీ నగర్ క్రాస్ రోడ్డు వద్ద గల గోదాము పై సోమవారం రాత్రి వరకు విజిలెన్స్ దాడులు కొనసాగాయి. ఈ దాడుల్లో స్థానిక రికార్డుల ప్రకారం అలాగే భౌతికంగా ఉన్న బిల్లుల మేరకు తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 3800 బస్తాలు వరి ధాన్యం అలాగే 230కొర్రలు రికార్డుల్లో ఉన్నట్లు గుర్తించారు. దీనికి సంబంధించిన గోదాము రికార్డులను మైదుకూరు మార్కెట్ యార్డ్ కార్యదర్శి వెంకటలక్ష్మికి అప్పగించారు. ఈ విజిలెన్స్ దాడుల్లో శ్రీనివాసులు రెడ్డి, డిసిడిఓ ఖాజా హుస్సేన్, ఏఓ లక్ష్మణ్ కుమార్ లు పాల్గొన్నారు. గోదాములో వాస్తవంగా రికార్డుల ప్రకారం ఉన్నవ లసిన వాటికంటే ఎక్కువ బస్తాలు ఉన్నట్లు గుర్తించామని అధికారులు తెలి పారు.

కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత ఇచ్చింది గోరంత

K-Kలైన్ లేని విశాఖ రైల్వేజోన్ తలలేని మొండెంతో సమానం.

ముఖ్యమంత్రి గారూ! కొత్త పింఛన్లు ఎప్పుడు?

వేంపల్లె జూన్ 02 ప్రభాతవార్త

రాష్ట్ర విభజన జరిగి సరిగ్గా జూన్ రెండవ తేదీకి 12 సంవత్సరాలు అయింది. రాష్ట్ర విభజన సందర్భంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం విభజిత ఆంధ్రప్రదేశ్ కు అనేక వరాలు ప్రకటించింది. కానీ ఈ 12 సంవత్సరాలలో కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాల్సింది కొండంత కాగా ఇచ్చింది గోరంత మాత్రమే అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మంగళవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు ఐదు సంవత్సరాల పాటు ప్రత్యేక హోదా ప్రకటించింది. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాలని విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొనబడింది. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మించాలి. దుగరాజపట్నం వద్ద కొత్త మేజర్ ఓడరేవు నిర్మించాలి. ఇలా అనేక వరాలు ఇవ్వడం జరిగింది. ఈ హామీలు అమలై వుంటే ఈపాటికి నవ్యాంధ్ర స్వర్ణాంధ్ర అయి ఉండేది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే ఇవి ఎప్పుడో అమలై ఉండేవి. బిజెపి మోసగారితనం, టిడిపి, వైకాపాల చేతకానితనంతో 12 సంవత్సరాలైనా ఇవి అమలుకు నోచుకోలేదు. డబుల్ ఇంజన్ సర్కార్ గా చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వాలు కనీసం ఇప్పుడైనా ఈ హామీలు అమలు చేయాలని తులసి రెడ్డి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. విశాఖ రైల్వే జోన్ తలలేని మొండెం తో సమానం. కొత్తవలస కిరండోలు (కే కే) రైల్వే లైన్, అరకు రైల్వే స్టేషన్ లేని విశాఖ రైల్వే జోన్ తలలేని మొండెం తో సమానమని తులసి రెడ్డి అన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో కొత్తగా ఒక సామాజిక పెన్షన్ గాని ఇవ్వలేదు. దాదాపు రెండు లక్షల 50 వేల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. జూలై 1వ తేదీ నుంచి అర్హులైన వారికి కొత్త సామాజిక పెన్షన్లు ఇవ్వాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ గౌడ్ ఎస్సిసెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లెం విజయ్ భాస్కర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీలగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్న డాక్టర్ షఫీ నాయక్

లక్కిరెడ్డిపల్లి, జూన్ 02, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ సబ్సిడీతో అందిస్తున్న జీలుగా విత్తనాలను రైతుల సద్వినియోగం చేసుకోవచ్చని మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండీ షహినాయక్ పేర్కొన్నారు మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీతో జీవులుగా విత్తనాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే పచ్చి రొట్టె ఎరువులు విత్తనాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని రైతులు వీటిని సద్దినం చేసుకోవాలన్నారు జీవులుగా విత్తనాల వల్ల భూమిలో నత్రజని శాతం పెరిగి భూసారం ఘననీయంగా మెరుగుపడుతుందని దీని ద్వారా పంట దిగుబడులు బాగా వస్తాయన్నారు అంతే కాకుండా పెట్టుబడి ఖర్చులు తగ్గి ఎంకొని అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు ప్రతి రైతు వచ్చిన ఉత్తరాలను పొందవచ్చు అన్నారు ఈ కార్యక్రమంలో రైతు సేవ సిబ్బంది భూపేష్ అహ్మద్ అలీ కోటమ నాయకులు పాల్గొన్నారు.

దేవరెద్దుకు వెండి ముకుతాడు బహుకరణ

భక్తిభావాన్ని చాటుకొన్న దంపతుల

దేవరెద్దుతో కుటుంబసభ్యులు

మదనపల్లె, జూన్ 2 ప్రభాతవార్త

దేవరెద్దుమీద ఉన్న భక్తిభావంతో ఓ కుటుంబానికి చెందిన దంపతులు ఏకంగా వెండి ముకుతాడును బహుకరణ చేసి గ్రామంలో శభాష్ అనిపించుకొన్నారు. రూరల్ మండలం పాలెంకొండ దేవరెద్దుకు పోతబోలు గ్రామం, సిద్దమ్మగారిపల్లెకు చెందిన మాజీ ఎంపిపి జికె.వెంకటరమణ చిన్నకుమార్తె మాధవి, అల్లుడు భద్రయ్య, మనవుడు మౌనీష్, మనవరాలు లిఖితలు దేవరెద్దుకు చేయించిన110గ్రాములతో వెండి ముకుతాడును బహుకరించారు. రెండు రోజుల క్రితం సిద్దమంగారిపల్లెలో జరిగిన రాముల వారి తిరుణాల సందర్భంగా పాలెంకొండ దేవరెద్దుకు వారు వెండి ముకుతాడు వితరణ చేశారు. దీంతో గ్రామస్థులు ఆ కుటుంబసభ్యులను అభినందించారు. వెండికి అధికధరలు ఉన్న సమయంలో దేవరెద్దు మీద ఉన్న భక్తిభావంతో ఏకంగా వెండి ముకుతాడును బహుకరించడం విశేషం. ఆ కుటుంబ దాతృత్వాన్ని పలువురు ప్రశంసించారు. అనంతరం దేవరెద్దుకు భక్తి శ్రద్దలతో పూజలు చేశారు.

వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు పర్మిట్ తప్పనిసరి

జిల్లా మార్కెటింగ్ అధికారి త్యాగరాజు

మదనపల్లె, జూన్ 2 ప్రభాతవార్త :

వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఈ-ట్రాన్స్‌పోర్ట్ తప్పనిసరి జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి త్యాగరాజు మంగళవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. జులై 1నుంచి అమలయ్యే కొత్త విదానానికి రైతులు, వ్యాపారస్తులు సహకరించాలన్నారు. వ్యవసాయ మార్కెట్‌యార్డుల పరిధిలో కొనుగోలు చేసిన వ్యవసాయ ఉత్పత్తులను ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించే సమయంలో సంబందిత వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ జారీ చేయబడుతుందన్నారు. ఈ విధానం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల రవాణాలో పారదర్శకత పెరగడంతో పాటు మార్కెట్ ఫీజును ఎగవేతను నివారించడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులు, వ్యాపారులకు కూడా ప్రయోజనం చేకూరుతుందన్నారు. వ్యాపారులు, వాలంటరీ ట్రేడర్లు, రవాణాదారులు సంబంధిత నిబంధనలకు అనుగుణంగా ఈట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ పొందిన తరువాతే వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేయాలని సూచించారు. ఈ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్‌కు సంబంధించి పూర్తి వివరాల కోసం రైతులు, వ్యాపారులు తమ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిని సంప్రదించాలని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత తోనే దోమల నివారణ

వైద్యురాలు శ్రీగిరీష

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు జూన్ 2 ప్రభాతవార్త :

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల రహిత సమాజం సాధ్యమని, తలుపుల పి.హెచ్.సి ప్రధాన వైద్యాధికారులు శ్రీగిరీష అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో బాగంగా "చలి జ్వరము. మలేరియా కావచ్చు" అంశముపై తలుపుల పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పిస్తూ వ్యక్తికి జ్వరం చిన్న సమస్య కాదని, నిర్లక్ష్యం ప్రాణాంతకమని, జ్వరం వచ్చిన ప్రతిసారీ దోమ కాటుతో వచ్చే మలేరియా కావచ్చునని, చలితో కూడిన అధిక జ్వరం, బలహీనత, వాంతులు, తల ఒళ్ళు నొప్పులా, నిర్లక్ష్యం వహించకుండా వ్యాధి నిర్దారణ పరీక్షలు చేసుకొని సత్వర చికిత్స పొందాలని ఆశా కార్యకర్తల ద్వారా అన్ని పల్లెలో ప్రజలకు తెలియజే యాలని డా:గిరీష ఆశా డే సందర్భంగా కార్యకర్తలకు సూచించారు. ఈ జూన్ మాసమంతా మలేరియా వ్యతిరేక మసోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో విస్తృత అవగాహన ప్రజలకు కల్పించాలని డిప్యూటీ హెచ్ఇఒ కొండయ్య సూచించి , తలుపుల పురవీ ధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ కుసుమ,పర్యవేక్షకులు నాగమ్మ,రెడ్డెప్ప, ఏయన్ యం లు,సిహెచ్ఓ లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో దోమ తెరలు పంపిణీ

రామాపురం జూన్ 02 ప్రభాతవార్త:

మండలంలోని బండపల్లి ప్రేమాలయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో కీ.శే వై రాజారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి వసుంధర గారి ఆర్థిక సహాయంతో మంగళవారం వృద్ధులకు దోమతెరలు పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు లయన్ వసుపులేటి శ్యామ్ తెలిపారు. ఈ సందర్భంగా దాత వసుంధర గారు మాట్లాడుతూ ఈరోజు వై రాజారెడ్డి గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా నా వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈరోజు ప్రేమాలయ వృద్ధాశ్రమానికి దోమతెరలు అందజేయడం జరిగిందని ఆమె అన్నారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్ దాత కుటుంబ సభ్యులు జ్యోతిర్మయి, స్వాతిముత్యం, శ్వేతా రెడ్డి, వృద్ధాశ్రమం మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ వస్తే ఖర్చులు భయం

విద్యా వైద్యం సేద్యం పై ఖర్చుల భయం

. పీలేరు జూన్ 2 ప్రభాతవార్త:

ప్రతి ఏడాది జూన్ మాసం ప్రారంభ దశలో ఖర్చులు భయం ప్రజలను వెంటాడుతుంది. జూన్ నెల ఆరంభంలో పిల్లల చదువులు, వైద్యం, వ్యవసాయ పనులు అన్నీ ఒకేసారి ప్రారంభించాల్సి వస్తూ ఉండడంతో ఖర్చులు తడిసి మోపిడుగుతున్నాయి.

పిల్లల చదువులు కోసం

పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఫీజులు చెల్లించండంటూ.. పుస్తకాలు వచ్చాయి, తీసుకెళ్లండంటూ.. ప్రైవేటు పాఠశాలల నుంచి ఫోన్లు వస్తుంటే విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందే పరిస్థితి. నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ చదువులకే రూ.30వేల వరకు, ఒకటి నుంచి పదో తర గతి వరకు రూ.20వేల నుంచి రూ. లక్ష వరకు వెచ్చించాల్సిన పరిస్థితి. పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు, లంచ్ బాక్స్, ఇలా పలురకాల వస్తువుల కొనుగోలుకు ప్రతి విద్యార్థిపై తొలి నెలలోనే రూ. వేలల్లో ఖర్చవుతోంది.

సేద్యం.. పెట్టుబడిమయం

పంటల సాగుకు ఏటా పెట్టుబడి తడిసిమో పెడు అవుతోంది. కూలీల ఖర్చు, విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. తొలకరి చినుకులు పలకరించడంతో అన్నదాతలు సేద్యానికి సమాయత్తం అవుతున్నారు. ప్రస్తుతం ఎరువుల ధరలు రెట్టింపు అయ్యాయి. ఈ సీజన్లో వ్యవసాయం సాగు చేయాలంటేనే రైతులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఎలా అని తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది.

వేధిస్తున్న డబ్బులు

వాతావరణ మార్పులతో వ్యాధులు పంజా విసిరేందుకు సిద్ధంగా ఉంటాయి. వర్షాలు కురుస్తుండటంతో దోమల బెడద ఎక్కువగా

పీలేరు ప్రభుత్వ హాస్పిటల్

ఉంటుంది. జ్వరం, గొంతునొప్పి, జలుబు, దగ్గు వంటి సమస్యలతో ఆసుపత్రులకు వెళ్లేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జ్వరం వచ్చి ఆసుపత్రి పాలైతే రూ. వేలల్లో ఖర్చు వుతోంది. ఇంట్లో ఉండి చికిత్స చేయించుకున్నా., ఔషధాలు, రక్త పరీక్షల రూపంలో పిండేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోకి వెళితే అన్ని జబ్బులకు ఒకే రకం మందులు ఇవ్వడంతో ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లడానికి వెనకడిగేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతూ వేలకు వేలు ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది.

ప్రణాళికబద్ధంగా కార్యచరణ

ఇదిలా ఉంటే జూన్ ఆరంభంలో విద్యాశాఖ, వైద్యశాఖ, వ్యవసాయ శాఖ వారికి వారు వేరువేరుగా సామాన్యుడు ఖర్చులు తగ్గించేందుకు ప్రణాళిక రచనతో ముందుకు సాగుతున్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతూ వస్తున్నారు.

జిల్లా మైనార్టీ రైట్స్ ఫోరం అధ్యక్షులుగా నూరు మహ్మద్

కలికిరి, జూన్ 2, ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లా మైనార్టీ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులుగా కలికిరి మండల కేంద్రానికి చెందిన నూరు మహ్మద్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా మైనార్టీ రైట్స్ ఫోరం ఉపాధ్యక్షులుగా నూరు మహ్మద్ విధులు నిర్వహించి మైనార్టీ హక్కులపై పోరాడి పలు సమస్యలను పరిష్కరించడం జరిగింది. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకులు ప్రస్తుతం అన్నమయ్య జిల్లా మైనార్టీ రైట్స్ ఫోరం అధ్యక్షులుగా నియమించడం జరిగింది. ఈసందర్భంగా నూరు మహ్మద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షునిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీ సమస్యల పరిష్కారానికి, వారి అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తాననేఇ ఆయన తెలిపారు. నూరు మహ్మద్ ఎంపిక పట్ల కలికిరి మండలంలో పలువురు ముస్లీం మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మలేరియా వ్యతిరేక దినోత్సవ మహోత్సవం పై ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రం సిబ్బంది

పెద్దమండెం జూన్ 2 ప్రభాతవార్త

మలేరియా నివారణకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు దోమకాటుకు మలేరియా ప్రభుత్వం ఉందని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు ప్రతి గ్రామంలో ప్రైడే ప్రైడే గా నిర్వహించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి కుంటలలో క్లోరిన్ చల్లి దోమల ప్రబలకుంట తగు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ హరి వర్మ అన్నారు ప్రతి గ్రామంలో స్వచ్ఛత పరిశుభ్రలో సక్కగా ఉంటేనే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని రానున్న వర్షాకాలంలో పూర్తి జాగ్రత్తలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు మలేరియా ద్వారా జ్వరం డెంగ్యూ ప్రబలుతుందని అందుకు దోమల నివారణ కచ్చితంగా పాటించాలని సూచించారు ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మురళీధర్ సూపర్వైజర్ రమణమ్మ ఆశా వర్కర్లు ఎంఎల్‌హెచ్ పిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రుల పైన కఠిన చర్యలు తీసుకుంటాం :ఎస్సై శివకుమార్

రామాపురం జూన్ 02 ప్రభాతవార్త:..

మైనర్ లు డ్రైవింగ్ చేసిన వారికి వాహనాలు ఇచ్చినా వాహన యజమానులు తల్లిదండ్రులపైనే కఠిన చర్యలు తీసుకుంటామని రామాపురం ఎస్సై శివకుమార్ తెలిపారు. మంగళవారం మైనర్ల డ్రైవింగ్ పైన స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మైనర్ డ్రైవింగ్ చేసే వారిని అదుపులోకి తీసుకొని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మైనర్లకు ఎటువంటి పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని ఒకవేళ ఇస్తే మైనర్ డ్రైవింగ్ లో పట్టుపడితే ఆ యొక్క వాహనాలు సీజ్ చేసి వాహన యజమానులు తల్లిదండ్రుల పైన నాన్ బెయిల్ సెక్షన్ల కింద కేసులు పెడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ర్యాలీ విజయవంతం

కలికిరి, జూన్ 2, ప్రభాతవార్త:

మండలంలోని మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్య పరిధిలో మంగళవారం వైద్యాధికారిని కావ్యగంధ ఆధ్వర్యంలో నిర్వహించిన మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ర్యాలీ కార్యక్రమం విజయవంతమైంది. మేడికుర్తి పీహెచ్‌సీలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని కావ్యగంధ మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ 1 నుంచి 30 వరకు ననిర్వహించనున్న మలేరియా వ్యతిరేక మాసోత్సవాల కార్యక్రమాన్ని వైద్యసిబ్బంది విజయవంతం చేయాలని ఆమె పేర్కొన్నారు. మలేరియా మరియు ఇతర కీటక జనిత వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారిని సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ముజీబ్ బాషా, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, గిరిజమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ

పీలేరు జూన్ 2 ప్రభాతవార్త:

స్థానిక సదుం రోడ్డులోని లక్ష్మీ వృద్ధాశ్రమానికి పీలేరు లయన్స్ క్లబ్ ప్లాటినమ్ ఆధ్వర్యంలో బియ్యం వితరణ చేశారు. మంగళవారం నాలుగు బస్తాల బియ్యాన్ని లక్ష్మీ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు విజయలక్ష్మీకి అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్లాటినం అధ్యక్ష, కార్యదర్శులు గ్యారంపల్లె రమేష్‌రెడ్డి, సోమిశెట్టి సురేష్ బాబు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్లాటినం సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. పేదలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్లాటినం జిల్లా ఆఫీసర్స్ డాక్టర్ కల్లూరి రాజారెడ్డి. డాక్టర్ సంజీవరెడ్డి, బలసా వేణుగోపాల్ పాల్గొనారు.

మహల్‌లో తొలగిన కోతుల బెడద

కలికిరి, జూన్ 2, ప్రభాతవార్త:

మండలంలోని మహల్ పంచాయతీలో ఎట్టకేలకు అధికారుల చొరవతో ప్రజలకు కోతుల బెడద తొలగింది. మహల్ కోతుల అధికంగా తిరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను ప్రజలు పంచాయతీ కార్యదర్శి మునిరాజా దృష్టికి తెచ్చారు. దీంతో కార్యదర్శి మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు కోతులను పట్టించి బయటి ప్రాంతాలకు తరలించడం జరిగింది. దీంతో మహల్ గ్రామంలో కోతుల బెడద తొలగడంతో గ్రామస్థులు పంచాయతీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

చట్టాలపై అవగాహన సదస్సు

చిన్నమండెం, జూన్ 2, ప్రభాతవార్త:

మండలంలోని మల్లూరు గ్రామ కస్పాలో మంగళవారం రాయచోటి రూరల్ సీఐ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సిఐ రోషన్ మాట్లాడుతూ మహిళల పట్ల గౌరవం కలిగి వుండాలన్నారు. బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్,గంజాయి స్మగ్లింగ్,ఐవి ఆర్ ఎస్ కాల్స్ తదితర చట్టాల పై అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యస్ ఐ సుధాకర్ పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బోయ వాల్మీకులకపై దాడి చేస్తే సహించం

వాల్మీకి రాష్ట్ర అధ్యక్షులు పొదల నరసింహులు

సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 2 ప్రభాతవార్త :

బోయ వాల్మీకులపై దాడిచేస్తే సహించేది లేదంటూ వాల్మీకి రాష్ట్ర అధ్యక్షులు పొదల నరసింహులు హెచ్చరించారు. మంగళవారం వాల్మీకి రిజర్వేజన్ సాధన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూల్‌జిల్లా ఆలూరు నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దడానికి రాష్ట్ర కమిటీ నుంచి విచ్చేసిన జోన్-5 రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డికి టిడిపి కార్యకర్త బోయమల్లన్న సమస్యలను విన్నవించడం జరిగిందన్నారు. సమస్యలు పై అధికారులకు చెబుతావా అంటూ వైకుంఠజ్యోతి పిఏ రెహమాన్ బోయ మల్లన్నను కులంపేరుతో దూషిస్తూ అమానుషంగా కొట్టి దాడికి పాల్పడ్డాడన్నారు. రెహమాన్‌ను తక్షణమే అరెస్టచేసి చట్టప్రకారం శిక్షించాలన్నారు. బోయ వాల్మీకి ఫెడరేషన్ స్పందించి బాధితునికి అండగా నిలవాలన్నారు. బోయ మల్లన్నకు న్యాయం జరిగే వరకు పోరాడాలన్నారు. ఇలాంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంపల నాగరాజు, మేకల విజయమోహన్, బొగ్గిటి క్రిష్ణమూర్తి, విష్ణుచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సమీక్షలో మదనపల్లె నాయకులు

సమావేశంలో పాల్గొన్న దృశ్యం

మదనపల్లె, జూన్ 2 ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఓటర్ జాబితా సవరణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యులు, రాష్ట్ర ఉర్దూ కమిటీ వైస్‌ఛైర్మెన్ పఠాన్‌ఖాదర్‌ఖాన్, ఆర్టీసీ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూర్‌వల్లిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఓటర్‌జాబితాలో స్పెషల్ ఇంటెన్సీవ్ రీవిజన్ కార్యక్రమంపై నిర్వహించిన వర్క్‌షాపులో పలు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు, జిల్లా అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరని అనుభవం కలిగిన ముఖ్యమంత్రి సూచనలు పాటిస్తే రాజకీయంగా ఉన్నత స్థితికి ఎదగవచ్చునన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలి

చిన్నమండెం జూన్ 2 ప్రభాత వార్త:

భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి సతీమణి హరిత సూచించారు.ఆమె మంగళవారం మండలం లోని చాకిబండ గ్రామం కుమ్మరపల్లిలో స్థానిక ప్రజల కోరిక మేరకు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నట్లు వారు దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన హరిత సంబంధిత రెవెన్యూ అధికారులకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు... ఈ సందర్భంగా పలువురు టిడిపి కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ రామాంజనేయులు మరియు రెవిన్యూ అధికారులు మరియు గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల వైద్య సేవలకు ఆశ కార్యకర్తలే ఆయువు పట్టు

డాక్టర్ షణ్ముఖ

తంబళ్లపల్లె జూన్ 2 ప్రభాతవార్త ఃి

మారుమూల గ్రామీణ ప్రాంతాలలో నిరుపేద ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించడంలో ఆశ కార్యకర్తలు చేస్తున్న సేవ ఆయువుపట్టు లాంటిదని పీహెచ్సీ డాక్టర్ షణ్ముఖ కొనియాడారు. మంగళవారం పిహెచ్సిలో ఆశాడే లో పాల్గొని ఆశలు చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ భవిష్యత్తులో మీ సేవలను మరింత పారదర్శకంగా కొనసాగించాలన్నారు. అనంతరం పిహెచ్సి పరిధిలో మలేరియా మాసోత్సవాల కార్యక్రమాన్ని డాక్టర్ షణ్ముఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, పారిశుధ్యం పై పాటించాల్సిన మెలకువలు, తాగునీటి క్లోరినేషన్, బ్లీచింగ్, మలేరియా పిచికారి, వ్యక్తిగత పారిశుధ్యం పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బంది చేత పారిశుధ్యం మెరుగుకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని దీంతోపాటు ప్రజలకు వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు సూచించే ప్రక్రియలో ముందుంటామని సంపూర్ణ ఆరోగ్య సేవలకు కట్టు బడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేంద్ర, కోసువారిపల్లి పిహెచ్సి ఏఎన్ఎంలు, మేల్ వర్కర్లు,ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆలయ వార్షికోత్సవం...

వేంపల్లి జూన్ 02 ప్రభాతవార్త

వేంపల్లె పట్టణంలో వెలిసిన శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆలయంలో మంగళవారం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.వేంపల్లె మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని వేంపల్లె మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు వెంకటరత్నం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం త్యాగరాజ మూల మూర్తికి పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయీ బ్రహ్మాణ సంఘానికి చెందిన గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు గండికోట వెంకటశివ మాట్లాడుతూ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా సాయంత్రం వేంపల్లె పట్టణ పురవీధుల్లో తాలమేళాల, బాణసంచాల నడుమ అంగరంగ వైభవంగా శ్రీ త్యాగరాజ స్వామి చిత్రపటాన్ని గ్రామోత్సవం నిర్వహించామని తెలిపారు. గ్రామోత్సవంలో ఏర్పాటు

చేసిన వేషధారణలు ప్రజలను అక్షట్టుకున్నాయి. పలువురు ప్రముఖులు శ్రీ త్యాగరాజ స్వామిని దర్శించుకున్నారని తెలిపారు. వారిని దుశ్శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వేంపల్లె మండల నాయీ బ్రహ్మాణ సేవా సంఘం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

అర్కే వ్యాలీ డైరెక్టర్‌గా జి. విజయ్ ప్రకాష్

వేంపల్లె, జూన్ 02 (ప్రభాత వార్త)

ఇడుపులపాయ పరిధిలోని ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ నూతన డైరెక్టర్‌గా ఐఐటి ఢిల్లీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న జి. విజయ్ ప్రకాష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం క్యాంపస్‌లోని వివిధ విభాగాల అధిపతులతో సమావేశమై విద్యా, పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జి. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ క్యాంపస్ సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు సంస్థ ప్రతిష్ఠను మరింత పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి డా. పి. రవికుమార్, డా. కొండా రెడ్డి, డా. రత్నకుమారి, అసోసియేట్ డీన్స్, ఎస్టాబ్లిష్మెంట్ కోఆర్డినేటర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలను పాటించని

మెడికల్ షాపులపై చర్యలకు వినతి

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 2, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు మండల మెజిస్ట్రేట్‌కు ప్రొద్దుటూరులో ఉన్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాపరెడ్డి ప్రజా ఫిర్యాదుల వేదిక పీజీఆర్ఎస్ ద్వారా వినతి సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి ఎమ్మార్వోకు విన్నవిస్తూ ప్రొద్దుటూరు మండల వ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులలో దాదాపు బీ ఫార్మసీ లేదా ఎం ఫార్మసీ చదివిన వ్యక్తులు లేరని, కేవలం సర్టిఫికెట్లు మాత్రమే కనబడతాయని నిబంధనల ప్రకారం డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటే మాత్రమే మందులు ఇవ్వాల్సి ఉన్నా వారికి వారే డాక్టర్ల అవతారం ఎత్తుతూ రోగులకు అనవసరమైన మందులను అంటగడుతూ ఉన్నారని తక్కువ ధరలో దొరికే మందులను సైతం అధిక ధరలకు విక్రయిస్తూ బ్రాండెడ్ మందులంటూ రోగులను ప్రజలను మభ్యపెడుతూ ఉన్నారని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకునేలా ఎమ్మార్వో పీజీఆర్ఎస్ ద్వారా ఆదేశించాలని కోరుతూ ఫిర్యాదు సమర్పించారు. అదే సమయంలో ఇంత వరకు ఈ మెడికల్ షాపులపై చర్యలు తీసుకొని సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని మెజిస్ట్రేట్‌ను ప్రతాప్‌రెడ్డి కోరారు.

బీఈడీ కళాశాలల తనిఖీలపై

విచారణ జరపాలి

పీడీఎస్‌యూ డిమాండ్

ఎడ్యుకేషన్ జూన్ 2 ప్రభాతవార్త :

యోగి వేమన విశ్వవిద్యాలయం (వైవియు) పరిధిలోని కొన్ని బీఈడీ కళాశాలల తనిఖీల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న ఆరోపించారు. మంగళవారం వైవియు వైస్ ఛాన్సలర్‌కు వినతిపత్రం సమర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని పలువురు బీఈడీ కళాశాలలు ప్రభుత్వం, ఎన్‌సీటీఈ నిబంధనలను పాటించడం లేదన్నారు. భవనాలు, అధ్యాపకులు, విద్యార్థులు వంటి కనీస సౌకర్యాలు లేకపోయినా అన్ని సౌకర్యాలు ఉన్నట్లు తనిఖీ నివేదికలు ఇవ్వడం విద్యా వ్యవస్థకు హానికరమని అన్నారు. అర్హతలేని బీఈడీ కళాశాలలను ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌కు అనుమతించకుండా బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, మహేశ్ పాల్గొన్నారు.

మడికేరిలో జరిగిన అకాడమీ

ఎంపికల్లో ప్రతిభ చాటిన చరిత

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాకీ శిక్షణకి ఎంపిక

మూడేళ్ల కృషికి ఫలితం

పులివెందుల, జూన్ 2, ప్రభాతవార్త :

పులివెందులకు చెందిన యువ హాకీ క్రీడాకారిణి ఎన్. చరిత ప్రతిభకు గుర్తింపుగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాకీ ట్రైనింగ్ సెంటర్‌కు ఎంపికైంది. స్థానిక వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గత మూడు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా హాకీ శిక్షణ పొందుతున్న చరిత, తన అంకితభావం మరియు కఠోర సాధనతో ఈ అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది.ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని మడికేరిలో ఏప్రిల్ నెలలో నిర్వహించిన హాకీ అకాడమీ ఎంపిక పరీక్షల్లో చరిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సెలెక్టర్లను ఆకట్టుకుంది. దీంతో ఆమెను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాకీ ట్రైనింగ్ సెంటర్‌కు ఎంపిక చేసినట్లు స్థానిక ఖేలో ఇండియా హాకీ కోచ్ తెలిపారు.చరిత ఈ నెల 8వ తేదీన అకాడమీలో చేరనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ క్రీడాకారిణి జాతీయ స్థాయి హాకీ శిక్షణ కేంద్రానికి ఎంపిక కావడం పులివెందుల క్రీడా రంగానికి గర్వకారణమని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి.చరిత సాధించిన ఈ విజయంపై డీఎస్‌డీఓ గౌస్ బాషా, వైఎస్సార్ ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జ్ యేసుదాసు, ఖేలో ఇండియా డిప్యూటీ డైరెక్టర్ హిమబిందు, స్థానిక ఖేలో ఇండియా హాకీ కోచ్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

టిడిపి అధ్యక్షుని ఆధ్వర్యంలో ఓట్ల పరిశీలన

సుండుపల్లె, జూన్ 02,ప్రభాతవార్త :

సుండుపల్లె మండల పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఓట్ల వెరిఫికేషన్ కార్యక్రమంలో టిడిపి బీసీ సాధికార సమితి పాల ఏకరి రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్ నాయుడు (గుట్ట బాబు) పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండలంలోని పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, మరణించిన ఓటర్లు, డబుల్ ఎంట్రీ ఓటర్లు, విదేశాలకు వెళ్లి స్థిరపడిన ఓటర్ల వివరాలను గుర్తించి తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే గ్రామాల్లో ప్రజలందరూ ఐకమత్యంగా ఉండి, గ్రామాభివృద్ధి మరియు స్థానిక సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్, మహిళలు మరియు పిల్లల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, బీసీల సంక్షేమం కోసం చేపడుతున్న చర్యలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా దూరదృష్టితో ముందుకు సాగుతున్న నాయకుడు చంద్రబాబు నాయుడు అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిని కలిసిన జేఏసీ నాయకులు

యర్రగుంట్ల :జూన్ 2 ప్రభాతవార్త

ఆర్‌టిపిపి కాంటాక్ట్ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం దేవగుడిలోని జమ్మలమడుగు శాసనసభ్యులు దేవగుడి ఆదినారాయణ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వంగా కాంటాక్ట్ కార్మికుల జేఏసీ నాయకులు కలిసి కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు అనంతరం కాంట్రాక్టు కార్మికుల సమస్యపై ఎమ్మెల్యే దేవుడి ఆదినారాయణ రెడ్డి గ్రేట్ చేంజ్ సమస్యపై స్పందిస్తూ ఏపీ జెన్కో ఎండి నాగలక్ష్మి తో చర్చించి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు మరియు కాంటాక్ట్ కార్మికుల విలీనం అంశాన్ని ప్రభుత్వం దృష్టికి మరియు యాజమాన్యాన్ని దృష్టికి తీసుకెళ్తానని పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని కార్మికుల జేఏసీ నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్టిపిపి కాంటాక్ట్ కార్మికులు కార్మికుల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

గురుకులంలో చేరే

విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్..

బ్రహ్మంగారిమఠం జూన్ 02 ప్రభాతవార్త

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో ఐదవ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు ఈనెల 8వ తారీఖున కడప లోని చిన్నచౌక్ లో ఉన్నటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల కళాశాల యందు స్పాట్లోనే అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని డిసిఓ ఉదయశ్రీ తెలియజేశారు. విద్యార్థులు అర్హత పరీక్ష రాసినా రాయక పోయినా కూడా ఈ కౌన్సిలింగ్ కు హాజరై చేరవచ్చునారు.ఈ కౌన్సిలింగ్ సోమవారం ఉదయం 10 గంటలకు 5 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి ఇంటర్ విద్యార్థులకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు.బి.మఠం మండలంలో ఉన్నటువంటి రెండు పాఠశాలలకు అనగా పాత,కొత్త(తోట్లపల్లె) పాఠశాలలో చేరుటకు కూడా ఈ కౌన్సిలింగ్ కు హాజరు కావాలన్నారు.ఈ కౌన్సిలింగ్ కు హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులు క్యాస్ట్ సర్టిఫికెట్,ఎస్.ఎస్.సి సర్టిఫికెట్,ఆధార్ కార్డు,టిసి వెంట తీసుకుని కడపలోని చిన్న చౌక్ లో ఉన్న డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించు కౌన్సిలింగ్‌కు వెళ్లాలని డిసిఓ ఉదయశ్రీ తెలిపారు.

దోమల నియంత్రణ పై ర్యాలీ

దువ్వూరు, జూన్ 02, ప్రభాతవార్త:

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ సురేష్ బాబు పర్యవేక్షణలో మంగళవారం దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలను తరిమి కొట్టి మలేరియాను నిర్మూలించాలన్నారు. వీధుల్లో కానీ, ఇళ్లల్లో కానీ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని పేర్కొన్నారు. అలాగే చలి జ్వరం వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శాంతకుమారి, వీరాంజినేయులు, జనార్దన్ రావు, రవికుమార్ పాల్గొన్నారు.

పల్స్ పోలియో ప్రోగ్రాను

పగడ్బందీగా నిర్వహించాలి

బ్రహ్మంగారిమఠం జూన్ 02 ప్రభాతవార్త

మండల కేంద్రం లోని ప్రభుత్వ వైద్యశాల లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈనెల 28వ తారీకున నిర్వహించే పల్స్ పోలియో ప్రోగ్రామును పగడ్బందీగా నిర్వహించాలని సిహెచ్ఓ సాంబశివారెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ డే ను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఈ నెల 28వ తేదీన జరిగే పల్స్ పోలియో ప్రోగ్రాం లో అందరూ పాల్గొని 0 టు 5 ఏళ్ల పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని చెప్పారు. అలాగే జూన్ 1 నుండి 30 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించాలని మరియు మలేరియా రహిత సమాజంగా తీర్చిదిద్దాలని వైద్య సిబ్బందికి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమములో ఇంచార్జ్ డాక్టర్ సాయి తేజ,సూపర్వైజర్ పుష్పరాజ్,హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఏంఎల్‌హెచ్ పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పుడమి తల్లికి నైవేద్యం

సుండుపల్లె, జూన్ 02, ప్రభాతవార్త :

మండల కేంద్రంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ శాఖల సమన్వయంతో పశుసంవర్ధక శాఖ మరియు రైతుకు సేవా కేంద్రాలతో ప్రకృతి వ్యవసాయ విధానాలను అందులో పిఎండిఎస్ విధానంలో విత్తన గుళికల తయారీపై స్థానిక వివో 7 మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పశు వైద్యాధికారి డాక్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో విత్తన గుళికల తయారీ విధానం పై మరియు వాటి ప్రాధాన్యంపై డెమో ద్వారా చేసి స్థానిక డోక్రా మహిళలకు వివరించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మొదటగా ఏదైనా అలసందలు గాని కందులు గాని అనుములు గాని తీసుకొని వాటికి తగినంత బీజామృతాన్ని చిలకరించుకుంటూ పూర్తిగా బాగా తడిసిన తర్వాత వాటికి మొదటి గా బంక మట్టిని వేసుకోవడం తరువాత బాగా జల్లెడ పట్టిన ఘనజీవామృతాన్ని విత్తనాలపై వెయ్యడం కాకుండా వాటికి బాల్స్ మాదిరి తయారై సైజు వచ్చే వరకు ఘనజీవామృతాన్ని వేయాలి, తరువాత విత్తనాలపై ఉన్నటువంటి తేమ శాతాన్ని పీల్చుకొని విత్తనము భద్రపరచుకొని పిండోత్పత్తి జరగడానికి మొక్కకు కావలసిన తేమను ఘన జీవామృతం ఉంచి పొందుతుందని తెలపడం జరిగినది ఈ విధానం వలన వర్షాధారం భూములు కలిగిన రైతులందరూ ఈ వేదానాన్ని కొనసాగించి పశువులకు అదే విధంగా పొట్టేళ్లకు ఈ విధానములో వచ్చి నట్టు గ్రాసాన్ని ఉపయోగించుకోవచ్చునని, రేపు వాతావరణం లో కలిగే మార్పులను తక్కువ వర్షపాతం కావచ్చు ఎక్కువ వర్షపాతం కావచ్చు అదేవిధంగా గాలి ప్రభావాన్ని వాతావరణంలో తేమను తొందరగా ఆరిపోవడానికి విపరీతమైన గాలుల నుంచి పంటలను కాపాడుకోవచ్చని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటరమణ,ప్రకృతి వ్యవసాయ ఎఫ్ఎమ్టీలు ఎం రామ్మోహన పి ఆంజనేయులు నాయుడు, ఎస్ వెంకటయ్య, డిఎంఎంటి వీర నాగయ్య, ఐసిఆర్పిలు ఎం లక్ష్మి, టిఐసిఆర్పి షబానా, యం సుమలత, ఎస్ఆర్పి రైతులు పాల్గొన్నారు ప్రకృతి వ్యవసాయం చేద్దాం పుడమి తల్లిని కాపాడుదాం ప్రకృతి వ్యవసాయం పుడమి తల్లికి నైవేద్యం అనే నినాదంతో ముగిసింది.

పార్టీ బలోపేతం - ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

వైకాపా కోర్ కమిటీ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి. శశికాంత్ రెడ్డి



కోర్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నేత రవీంద్రనాథ్ రెడ్డి

హాజరైన నాయకులు

పులివెందుల, జూన్ 2 , ప్రభాతవార్త :

పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడమే వైఎస్సార్సీపీ ప్రధాన లక్ష్యమని పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి. శశికాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నేత మాజీ ఎమ్మెల్యే రవీంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలు, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై మంగళవారం నిర్వహించిన వైఎస్సార్సీపీ కోర్ కమిటీ సమావేశంలో నాయకులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో పార్టీ శ్రేణులు ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు పెంపొందించు కోవడం, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్య కలాపాలను సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రైతులు, కూలీలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి పార్టీ నాయకులు చొరవ చూపాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డి.వి. శశికాంత్ రెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ ప్రజల ఆశయాలతో ఏర్పడిన పార్టీ అని, ప్రజా సంక్షేమమే పార్టీ ధ్యేయమని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండి వారి తరఫున పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అధినేత ఆలోచనలకు అనుగుణంగా ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలకు చేరువ కావాలని, పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కార్యకర్తలందరూ సమన్వయంతో పని చేయాలని సూచించిన ఆయన, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టే అంశాలపై కూడా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామస్థాయిలో పార్టీ విస్తరణకు సంబంధించిన తమ అభిప్రాయాలు, సూచనలను వెల్లడించారు.

అభయ ఆంజనేయ స్వామికి పూజలు

బద్వేల్ అర్బన్ జూన్ 02 :(ప్రభాతవార్త):



అధిక జ్యేష్ఠ మాసము లోని రెండవ మంగళవారం పురస్కరించుకొని స్థానిక శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయస్వామికి విశేష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు వీరేశచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, ఆకు పూజ, సింధూర అర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో పలువురు భక్తులు, ఉభయదాతలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక అభిషేక దాతలుగా ముచ్చర్ల సుధాకర రావు మరియు వారి సతీమణి సుజాతమ్మ, తుమ్మల పెంట సురేష్ బాబు సతీమణి జయ ప్రదా దేవి, తిరుపాలమ్మ మరియు వారి కుమారుడు రామచంద్ర కుటుంబ సభ్యులు. యాదాల్ల జయ సింహ రాజు సతీమణి కాత్యాయని కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మాదాపూర్ వెంకటరమణ, హరి, అనిత్, ముచ్చర్ల ప్రవీణ్ ఆడిటర్ శివకుమార్ మరియు పలు భక్తులు పాల్గొన్నారు.

జలమయంగా మారిన ఆర్ అండ్ బి రోడ్డు... పట్టించుకోని అధికారులు

కలసపాడు, జూన్ 2 ప్రభాతవార్త:

మండలంలోని ఎగువ తంబళ్లపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని సింగరాయపల్లె ఎస్సీ కాలనీలో మోటార్ దగ్గర లీకేజీ తో రోడ్లపైకి నీరు పారుతున్నాయని గ్రామ ప్రజలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత మూడు నెలల క్రితం నుండి నీరు వృధాగా పారుతూ ఉన్న విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుక వచ్చి నప్పటికీ పట్టించు కోవడం లేదని ఆరోపించారు. గ్రామ పంచాయతీ అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గాని, ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులను పట్టించుకునే నాధుడు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుసార్లు అధికారుల దృష్టికి తెచ్చిన ఏ ఒక్కరూ ప్రజలకు అవసరమైన నీటి సమస్య పరిష్కరించక పోగా వృధాగా వీధి రోడ్ల తో పాటు ప్రధాన తారు రోడ్డు కలసపాడు గిద్దలూరు మెయిన్ రోడ్డుపై వృధా నీరు వెళుతున్నా ప్రజా ప్రతినిధులు కానీ, ప్రభుత్వ అధికారులు గానీ ఏ ఒక్కరు పట్టించుకోక పోవడంతో వాహనదారులు రాత్రి సమయంలో బైక్ లు, సైకిల్ లలో ప్రయాణించే వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వెంటనే పైప్ లైన్ నుండి వృధాగా పారుతూ ఉన్న నీటిని ఆపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.